క్లుప్తంగా

వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడికి సత్కారం



మల్లికార్జునరెడ్డిని సత్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు

డోన్ : వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడిగా నియమితులైన మల్లికార్జునరెడ్డిని ఆ పార్టీకి చెందిన 32వ వార్డు ఇన్‌చార్జ్ వెంగల్‌రెడ్డి ఆధ్వర్యంలో బుధవారం కార్యకర్తలు ఘనంగా సత్కరించారు. పార్టీ అభ్యున్నతికి ఆవిర్భావం నుంచి విశేష కృషి చేసిన మల్లికార్జునరెడ్డికి సముచిత స్థానం కల్పించినందుకు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, మాజీ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు.

మహిళలకు ముగ్గుల పోటీలు



ముగ్గుల పోటీల్లో పాల్గొన్న మహిళలు

కొలిమిగుండ్ల: సంక్రాంతి పండుగను పురస్కరించుకొని రాఘవరాజుపల్లెలో దేవాలయాల పరిరక్షణ సమితి ఆధ్వర్యంలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీల్లో మహిళలు ఆసక్తిగా పాల్గొన్నారు. పోటీలో ప్రతిభ చాటి వరుసగా మూడు స్థానాల్లో నిలిచిన వారికి గ్రామ పెద్దలు బాలనాగిరెడ్డి చీరలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో హిందూ ధర్మ పరిరక్షణ సమితి జిల్లా నాయకులు శ్రీనివాసులు, రాములు నాయక్, ప్రసాద్,రాజేష్ పాల్గొన్నారు.

ప్రజలపై విద్యుత్ భారం మోపడం సరికాదు



విద్యుత్ బిల్లులను తగులబెడుతున్న దృశ్యం

డోన్ టౌన్ : ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలు నేరవేర్చకుండా కూటమి ప్రభుత్వం ప్రజలపై విద్యుత్ భారం వేయడం సరికాదని సీపీఎం మండల కార్యదర్శి కొయిలకొండ నాగరాజు అన్నారు. పెరిగిన విద్యుత్ చార్జీలను నిరసిస్తూ బుధవారం కోట్లవారి పల్లెలోని మూడు రోడ్ల సర్కిల్‌లో విద్యుత్ బిల్లులను మంటల్లో తగులబెడుతూ నిరసనలు వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు రామాంజనేయులు, నాగన్న, చిన్నరహిమాన్, నాగమద్దయ్య, నక్కి హరి, నరసింహా తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొన్న కారు



విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొన్న కారు

బేతంచెర్ల : పట్టణ సమీపంలోని అయ్యలచెర్వు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను కారు ఢీ కొట్టిన సంఘటన మంగళవారం చోటు చేసుకుంది. బేతంచెర్ల నుంచి కర్నూలు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి రహదారి పక్కన్న ట్రాన్స్‌ఫార్మర్‌ను ఢీ కొట్టడంతో పక్కన్న ఉన్న కరెంట్ స్తంభం విరిగిపోయింది. ఈ ప్రమాదంలో కారు కొంత మేర దెబ్బతినగా.. కారులో ఉన్న ఎవరికీ ఎలాంటి గాయాలు కాకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. సమాచారం అందుకున్న విద్యుత్ శాఖ అధికారులు విద్యుత్ సరఫరా నిలిపివేశారు. టౌన్ ఏఈ పుల్లయ్య ఘటనా స్థలానికి చేరుకొని ప్రమాదాన్ని పరిశీలించారు.

అయ్యప్ప స్వామికి నెయ్యి అభిషేకం

బేతంచెర్ల : పట్టణంలోని నంద్యాల రహదారిలోని వెలసిన అయ్యప్పస్వామి ఆలయంలో మకర సంక్రాంతిని పురస్కరించుకొని మంగళవారం మాల ధారుల ఆధ్వర్యంలో నెయ్యి అభిషేకం, పంచామృతాభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి నిర్వహించారు. సాయంత్రం గురుస్వాములు సాయి కృష్ణ, దివాకర్, భక్తుల ఆధ్వర్యంలో జ్యోతి దర్శనం ఏర్పాటు చేశారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి బలవన్మరణం

అవుకు: మండల పరిధిలో వేరువేరు చోట్ల ముగ్గురు వ్యక్తులు పేడరంగు సేవించి మృతి చెందారని పోలీసులు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామాపురం గ్రామానికి చెందిన కావలి లక్ష్మన్న(35) మద్యానికి బానిసై కుటుంబంతో గొడవపడి పేడరంగు సేవించి మృతి చెందాడని భార్య కావలి నాగలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. రామాపురం గ్రామంలో చాకలి అనసూయమ్మ(57)అనారోగ్య సమస్యలతో బాధపడుతూ పేడరంగు సేవించి మృతి చెందింది. వేముల పాడు గ్రామానికి చెందిన మద్దూరి సుజాత (61)అనారోగ్య సమస్యలతో భాధపడతూ సమస్యల నుంచి విముక్తి చెందాలని పేడరంగు సేవించి మృతి చెందింది. మృతిరాలి తమ్ముడు దిలిప్ కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని పోలీసులు తెలిపారు.



పాండురంగ స్వామిని ఊరేగిస్తున్న దృశ్యం

భక్తుల చెంతకు పాండురంగడు

- వైభవంగా పార్వేట ఉత్సవం
- ఉపవాస దీక్షలతో దళితుల మొక్కులు

కోవెలకుంట్ల: సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని పట్టణంలో వెలసిన శ్రీదేవి, భూదేవి సహిత పాండురంగ విఠలేశ్వరుడు భక్తుల చెంతకు చేరి పూజలందుకున్నాడు. బనగానపల్లె నియోజకవర్గంలోని ఆయా గ్రామాల్లో బుధవారం పార్వేట ఉత్సవం వైభవంగా సాగింది. పార్వేట సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలాచార్యులు, సుదర్శనాచార్యుల ఆధ్వర్యంలో స్వామికి అభిషేకాలు చేశారు. అనంతరం మండల పరిధిలోని సొదరదిన్నె, అమడాల గ్రామాల్లో స్వామివారి ఊరేగింపు అంగరంగ వైభవంగా కొనసాగింది. స్వామివారి పార్వేటను పురస్కరించుకుని సొదరదిన్నెలో ఎస్సీ కుటుంబాల్లోని వ్యక్తులు ఉపవాసదీక్షలు ఆచరించారు. స్వామి పాండురంగస్వామి అశ్వ వాహనంపై ఊరేగింపుగా గ్రామంలోకి రాగానే ఆ కుటుంబాలకు చెందిన చిన్నారులు పొర్లుదండాలతో స్వామివద్దకు వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. కాలనీకి చెందిన సంగూ, తిరుపతి వంశస్తులైన బాల నరసింహుడు ఆధ్వర్యంలో స్వామి వారిని పూలతో అలంకరించి ఖడ్గాలు చదువుతూ స్వామివారికి మొదటి పూజ చేసిన అనంతరం ఉపవాసదీక్ష విరమించారు. అక్కడి నుంచి పాండురంగని ఊరేగింపు అమడాల గ్రామానికి చేరుకోవడంతో ప్రజలు ఘనస్వాగతం పలికి పూజలు నిర్వహించారు. పార్వేట సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ఎస్ఐ మల్లికార్జునరెడ్డి గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. పాండురంగడి పార్వేటను పురస్కరించుకుని రెండు గ్రామాల ప్రజలకు కోవెలకుంట్ల పట్టణంలోని ఎస్ఎల్‌వీ సినిమా థియేటర్‌లో సినిమా చూసేందుకు ఉచిత ప్రవేశం కల్పించారు.

ముగిసిన కబడ్డీ పోటీలు



కబడ్డీ జట్టుకు బహుమతి అందిస్తున్న వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు మహేశ్వరరెడ్డి

కొలిమిగుండ్ల: సంక్రాంతి సందర్భంగా బెలుంలో రెండు రోజుల పాటు నిర్వహించిన కబడ్డీ పోటీలు బుధవారం ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి 35 జట్లు పోటీల్లో పాల్గొన్నాయి. హోరా హోరీగా జరిగిన పోటీల్లో ప్యాపిలి జట్టు మొదటి స్థానంలో నిలిచింది. పెట్నికోటకు చెందిన టీం రెండవ స్థానం, కల్వటాల మూడవ స్థానం, కొలిమిగుండ్లకు చెందిన జట్టు నాల్గవ స్థానంలో నిలిచాయి. గెలుపొందిన జట్లకు బహుమతి దాతలు టీడీపీ నాయకుడు పోతిరెడ్డి రాఘవరెడ్డి రూ.20,016, వైఎస్సార్‌సీపీ గ్రీవెన్స్ విభాగం జిల్లా అధ్యక్షుడు బాచం మహేశ్వరరెడ్డి, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి రూ.15,016, సింగనపల్లె హనుమంతురెడ్డి రూ.10,016, కానాల సంజీవరాయుడు రూ.5016లను అందజేశారు. క్రీడాకారులకు సర్పంచ్ మారం నీలమ్మ భోజన వసతి కల్పించారు.

చింతలాయిపల్లెలో: అంబటి శివశంకరరెడ్డి, శివప్రసాదరెడ్డి జ్ఞాపకార్థం చింతలాయిపల్లె పంచాయతీలోని నాలుగు గ్రామాల యువకుల కోసం నిర్వహించిన క్రికెట్ పోటీలు ముగిశాయి. చింతలాయిపల్లెకు చెందిన విజయ్ టీం, ఎస్సీ కాలనీకి చెందిన ఆది టీం విజేతలుగా నిలిచాయి. వీరికి వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు అంబటి గుర్విరెడ్డి చేతుల మీదుగా రూ.10వేలు, రూ.5వేలతో పాటు షీల్డ్‌లు అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేత అంబటి చంద్రమోహన్‌రెడ్డి పాల్గొన్నారు.

ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌తో భూములు ధారాదత్తం



మాట్లాడుతున్న రంగనాయకులు

డోన్ టౌన్ : కూటమి ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా తీసుక వచ్చిన ల్యాండ్ గ్రాబింగ్ యాక్ట్‌ను డోన్ రెవెన్యూ అధికారులు నీరుగారుస్తూ ప్రభుత్వ భూములను రియల్టర్లకు, భూకబ్జాదారులకు, రాజకీయనాయకులకు ధారదత్తం చేస్తున్నారని సీపీఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ ఉమ్మడి కర్నూలు జిల్లా కార్యవర్గ సభ్యులు రంగనాయకులు ఆరోపించారు. స్థానిక కార్యాలయంలో బుధవారం ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ డోన్ మండలంలోని ఉడుములపాడు గ్రామ సర్వే నంబరు 352, వెంకటనాయునిపల్లె 102 సర్వే నంబర్లలో ఉన్న ప్రభుత్వ భూములతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ఉన్న ప్రభుత్వ భూములను రెవెన్యూ అధికారులు సెటిల్‌మెంట్ చేస్తూ మార్చేస్తున్నారని ఆరోపించారు. గతంలో ఇక్కడ పని చేసిన వీఆర్వో మల్లారెడ్డి రెవెన్యూ అధికారులను కూడా చేతుల్లో పెట్టుకున్నాడన్నారు. పట్టణంలో ఆర్డీఓ కార్యాలయం ఉన్నప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని, తహసీల్దార్ కూడా ఆయనకే వత్తాసు పలుకుతున్నారని చెప్పారు. జిల్లా అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఆ పార్టీ మండల కార్యదర్శి దొరపల్లె రాజు, అఖిల భారత రైతు సంఘం నాయకులు శ్రీరాములు ఉన్నారు.

దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె రూరల్ : వైఎస్సార్‌సీపీ నాయకుడు అబ్దుల్‌ఫైజ్ ఇంట్లో వివాహ వేడుక జరుగుతుండగా లోపలికి ప్రవేశించి దాడిచేసిన మంత్రి బీసీ అనుచరులపై కఠిన చర్యలు తీసుకోవాలని మాజీ ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక పోలీస్ స్టేషన్ వద్ద ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వంలో పెళ్లిలు చేసుకోవాలన్నా ప్రజలు భయంభ్రాంతులకు గురవుతున్నారన్నారు. అబ్దుల్‌ఫైజ్ కుమారుడి ఇంట్లో మహిళలు ఉన్నారని కూడా పట్టించుకోకుండా మంత్రి అనుచరులుతో పాటు సీఐ కూడా దౌర్జన్యంగా ప్రవేశించడం, వివాహ వేడుక చిత్రీకరిస్తున్న కెమెరాసుల లాక్కొని పగలగొట్టడం దుర్మార్గమైన చర్యగా అభివర్ణించారు. పెళ్లిలకు, రాజకీయాలకు సంబంధంలేదని, వైఎస్సార్‌సీపీకి చెందిన అబ్దుల్‌ఫైజ్ తన కుమారుడికి టీడీపీకి చెందిన నాయకుడు అల్తాఫ్ కుతూరుతోనే వివాహం చేస్తున్నారని తెలిపారు. మున్ముందు ఇలాంటి సంఘటన జరగకుండా దాడికి పాల్పడిన నిందుతులపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మంత్రి ఇంటిని డ్రోన్ కెమెరాతో చిత్రీకరించి ఉంటే పరిశీలించి వారిపై కేసు నమోదు చేయాలే తప్ప, ముస్లింల ఇంట్లోకి దౌర్జన్యంగా వెళ్లి బీభత్సం సృష్టించడం మంచిదికాదని హితవుపలికారు. కార్యక్రమంలో సీనియర్ న్యాయవాది అబ్దుల్‌ఖైర్, వైఎస్సార్‌సీపీ నాయకులు అబ్దుల్‌ఫైజ్ తదితరులు ఉన్నారు.

శ్మశానవాటిక రస్తా ఆక్రమణకు యత్నం

సంజామల: మండల పరిధిలోని పేరుసోముల గ్రామంలో ఎస్సీల శ్మశానవాటికు వెళ్లడానికి రస్తా లేకుండా స్థానిక టీడీపీ నాయకులు కబ్జా చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారని ఎస్సీ కాలనీవాసులు ఆరోపించారు. స్థానిక టీడీపీ నాయకుల పొలం వెనుక ఎస్సీల శ్మశానవాటిక ఉందన్నారు. శ్మశానవాటిక రాస్తాను సగం ఆక్రమంచుకోవాడానికి ప్రయత్నం చేస్తున్నాడన్నారు. ఈ విషయంపై మంగళవారం తహసీల్దార్‌కు ఫిర్యాదు చేశారు. కాగా సర్వే చేసి రస్తా వచ్చేవిధంగా చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారని కాలనీవాసులు తెలిపారు.

మహిళ ఆత్మహత్య

బేతంచెర్ల : మూర్ఛ వ్యాధితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన బుధవారం పట్టణంలోని అయ్యలచెర్వులో చోటు చేసుకుంది. అయ్యలచెర్వులో నివాసం ఉండే ప్రకాశం తన కుమార్తె మహేశ్వరి(20)ని మండలంలోని ఎం.పేండేకల్లు గ్రామానికి చెందిన మధుసూదన్‌కు ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశాడు. ఇటీవల తండ్రి ప్రకాశం మహేశ్వరిని క్రిస్మస్ పండుగకు బేతంచెర్లకు తీసుకువచ్చాడు. అయితే నాలుగు నెలలుగా మహేశ్వరి ఫిట్స్(మూర్ఛ) వ్యాధితో బాధపడుతోంది. దీంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరూ లేని సమయంలో మహేశ్వరి పెండ రంగు సేవించి మృతిచెందింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రమేష్ బాబు తెలిపారు.

ఆలయ ప్రారంభోత్సవానికి సంపూర్ణ సహకారం



సిద్ధి సాయి ఆలయ పరిసర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజేష్

డోన్ : పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో 44వ జాతీయ రహదారి పక్కన కోట్లాది రూపాయల వ్యయంతో నిర్మించిన సిద్ధి సాయి ఆలయ ప్రారంభోత్సవ కార్యక్రమానికి సంపూర్ణ సహకారం అందిస్తామని మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్ తెలిపారు. బుధవారం ఆలయ పరిసర ప్రాంతాలను కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. వచ్చే నెల 9 నుంచి 13వ తేదీ వరకు ప్రతిష్టాత్మకంగా నిర్వహించే సిద్ధి సాయి బాబా ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమానికి మున్సిపాలిటీ పాలకవర్గం, అధికారులు సంపూర్ణంగా సహకరిస్తారని ఆలయ కమిటీ సభ్యులకు హామీనిచ్చారు. ఆలయ కమిటీ సభ్యులు ఆలా మల్లికార్జునరెడ్డి, కందుకూరి పార్థ, కొండా సురేష్, సీమ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



మాంసం విక్రయాల వద్ద గుమిగూడిన జనం

మాంసం కోసం పాట్లు

కొలిమిగుండ్ల: సంక్రాంతి పండుగలో భాగంగా బుధవారం కనుమ కావడంతో మాంసం కోసం జనం పడరాని పాట్లు పడాల్సి వచ్చింది. కొలిమిగుండ్లలో స్టేట్ బ్యాంక్ ఎదురుగా ప్రధాన రహదారి పక్కనే ఏర్పాటు చేసిన మాంసం విక్రయ దుకాణాల వద్ద తెల్లవారు జామున ఐదు గంటల నుంచి పదుల సంఖ్యలో గుమికూడారు. చుట్టు పక్కల పది గ్రామాల నుంచి ఎక్కువ భాగం మటన్ కోసం వచ్చారు. ఆప్రదేశాలన్నీ బైక్‌లతో నిండిపోయాయి. గంటల తరబడి నిరీక్షించించి మాంసం తీసుకెళ్లాల్సి వచ్చింది. పల్లెల నుంచి వచ్చిన వాళ్లు మటన్ కోసం 11 గంటల వరకు వేచి చూడాల్సి వచ్చింది.

అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులకు భూమిపూజ

బనగానపల్లె రూరల్ : బనగానపల్లె పట్టణంలో అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణానికి రాష్ట్ర రోడ్లు భవనాలు, పెట్టుబడులు, మౌలిక వసతులశాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి బుధవారం భూమి పూజ చేశారు. మంత్రి బీసీ మాట్లాడుతూ పట్టణంలో పారిశుద్ధ్యం మెరుగు కోసం సుమారు రూ.30.66 కోట్ల అంచనాతో అండర్‌గ్రౌడ్ డ్రైనేజీలు ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. అలాగే పట్టణంలోని పురాతన పశువైద్యశాలను మంత్రి బీసీ జనార్ధన్‌రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పశువైద్యశాల అవరణంలో ఉన్న రైతు శిక్షణ భవనంతో పాటు పురాతన పశువైద్యశాలను పరిశీలించి, పని చేస్తున్న సిబ్బంది తదితర వివరాలను ఏడీఏ డాక్టర్ మారుతిసకారంను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ వెంకటరమణ, పీఆర్‌డీఈఈ నాగశ్రీనివాసులు, పీఆర్ ఏఈ రమణ, పశువైద్యులు డాక్టర్ రామ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

డాక్టర్ గురునాథ్ వృషభాల జయకేతనం

డోన్ రూరల్ : మండల పరిధిలోని కొత్తకోట గ్రామంలో సంక్రాంతి పండుగ సందర్భంగా బుధవారం న్యూ కేటగిరీ ఎద్దుల బండలాగుడు పోటీలు నిర్వహించారు. పోటీలలో కొత్తకోటకు చెందిన డాక్టర్ గురునాథ్ వృషభాలు విజేతగా నిలిచి రూ.50వేలు కైవసం చేసుకున్నాయి. తరువాతి స్థానాలలో ప్యాపిలికి చెందిన వెంకటేష్ రూ.35వేలు, అనంతపురం జిల్లా, అక్కంపల్లి ఎద్దుల రూ.25వేలు, అనంతపురం జిల్లా, సంగనగుంటపల్లెకు చెందిన రూ.రామకృష్ణారెడ్డి వృషభాలు రూ.15వేలు, నంద్యాల జిల్లా, గోరగుట్లకు చెందిన ఇంద్రసేనారెడ్డి ఎద్దుల రూ.10వేలు, ప్యాపిలి మండలం, పీఆర్‌పల్లెకు చెందిన రామకృష్ణారెడ్డి వృషభాలు రూ.8వేలు, కొత్తకోట గ్రామానికి చెందిన కంబయ్య రూ.6వేలు, డోన్ మండలం, మల్యాల గ్రామానికి చెందిన ఎస్.ఎస్.వి.ట్రైడర్స్ ఎద్దులు రూ.5వేల రూపాయలను దక్కించుకున్నారు.

పేకాట రాయుళ్ల అరెస్టు

డోన్ టౌన్ : పేకాట స్థావరంపై దాడి చేసి ఏడుగురు పేకాట రాయుళ్లను అరెస్టు చేసినట్లు పట్టణ సీఐ ఇంతియాజ్‌బాషా, ఎస్ఐ శరత్‌కుమార్ రెడ్డి తెలిపారు. పట్టణ సమీపంలోని ఓనైరో స్కూల్ వెనుక ఉన్న ఖాళీ స్థలంలో పైకాట ఆడుతున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసినట్లు వారు తెలిపారు. ఈ దాడుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకున్నన్నారు. వారి వద్ద నుంచి రూ.15,350 నగదు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

డోన్ రూరల్ : మండల పరిధిలోని లక్కుంపల్లి గ్రామంలో బుధవారం రూరల్ పోలీసులు పేకాట స్థావరాలపై దాడులు నిర్వహించారు. ఈదాడులలో ఏడుగురు పేకాటరాయుళ్లను అరెస్టు చేసినట్లు తెలిపారు. వారి నుంచి రూ.48వేలు స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేశామన్నారు.

రాలుతున్న ఆశలు!

- మినుము పంటకు అనుకూలించని వాతావరణ పరిస్థితులు
- పొగమంచు వల్ల పూత, పిందె రాలుతున్న వైనం
- పంటకు తీవ్ర నష్టం,
- ఆదుకోని ప్రభుత్వం
- రైతుల అందోళన



దెబ్బతిన్న మినుము పంట

బనగానపల్లె : వాతావరణ పరిస్థితులు మినుము రైతును నష్టాలపాలు చేస్తున్నాయి. ఇటీవల సంభవించిన తుపాను, ప్రస్తుతం పొగమంచు ప్రభావంతో మినుము పంటకు పూత, పిందె రాలి పోవడంతో పంటదిగుబడి పూర్తిగా తగ్గే పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో పెట్టుబడులు కూడా చేతికందే అవకాశం లేదని రైతులు వాపోతున్నారు.

2500 ఎకరాల్లో సాగు..

వ్యవసాయాధికారుల లెక్కల ప్రకారం నియోజవర్గంలో సుమారు 2500 ఎకరాల్లో మినుము పంటను ఖరీఫ్‌లో సాగు చేయగా బనగానపల్లె మండలంలోనే వెయ్యి ఎకరాల్లో ఈ పంటను వేశారు. పంట పూత, పిందె దశలో ఆశజనకంగా ఉండటంతో మంచి దిగుబడి లభిస్తుందని రైతులు ఆశించారు. అయితే ఊహించని విధంగా సుమారు 15 రోజుల పాటు గత నెలలో తుపాను ప్రభావంతో వర్షాలు పడ్డాయి. దీనికి తోడు గత కొద్ది రోజులుగా కురుస్తున్న పొగమంచు వల్ల ఈ పంటకు ఉన్న పూత, పిందె చాల వరకు రాలిపోవడంతో తీవ్ర నష్టం వాటిల్లింది.

గతేడాది దిగుబడులతో పాటు గిట్టుబాటు ధర

గత సంవత్సరం ఎకరానికి 8–10క్వింటాళ్ల దిగుబడి లభించగా సుమారు రూ.9 వేల నుంచి రూ.10వేల వరకు గిట్టుబాటు ధర లభించింది. ఈ సంవత్సరం ఎకరానికి 3–4 క్వింటాళ్లకు మించి దిగుబడి లభించడంలేదని గిట్టుబాటు ధర కూడా రూ.7వేలు ఉందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ సంవత్సరం రసాయన ఎరువులు క్రిమిసంహారక మందులు వాడకంతో పాటు ఇతర పెట్టుబడులు ఎకరానికి రూ.20వేల వరకు ఖర్చు చేసినట్లు చెబుతున్నారు. దిగుబడులు చూస్తే పెట్టుబడులు కూడా చేతికందే అవకాశంలేదని వాపోతున్నారు. ప్రభుత్వం నుంచి పెట్టుబడిసాయం కూడా లభించకపోవడంతో పెట్టుబడి కోసం వడ్డీలతో అప్పులు చేల్లించాల్సి వస్తోందంటున్నారు. గతంలో ఎన్నడూ మినుము పంట సాగుచేసి నష్టపోలేదని, ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, గిట్టుబాటు ధర కల్పించి ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

సంబరాల సంక్రాంతి



బుగ్గానిపల్లె గ్రామంలో భక్త జనసందోహం మధ్య చెన్నకేశవస్వామి గ్రామోత్సవం



ఇందిరానగర్‌లో ఆకట్టుకుంటున్న చిలకజోస్యం చెప్పించుకుంటున్న బాలిక రంగవల్లి



బి.రామదుర్గంలో మహిళలకు బహుమతులు అందజేస్తున్న సర్పంచ్ నాగన్న, రామాంజినేయులు

డోన్: తెలుగువారి సంస్కృతిని ప్రతిబింభించే పర్వదినమైన సంక్రాంతిని ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. సోమవారం భోగి, మంగళవారం మకర సంక్రాంతి, బుధవారం నాడు కనుమను పండుగను జరుపుకున్నారు. బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో గ్రామాలు సందడిగా మారాయి. ఇళ్ల ముందు రకరకాల రంగవల్లులు, వాటిపై గొబ్బెమ్మలు, హరిదాసు కీర్తనలు, గంగిరెద్దుల విన్యాసాలతో సంక్రాంతి అంగరంగ వైభవంగా ముగిసింది. బుధవారం కనుమను కూడా ఘనంగా నిర్వహించుకున్నారు.

ముగ్గుల పోటీలు

డోన్ రూరల్ : సంక్రాంతి పండుగ సందర్భంగా పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. మండల పరిధిలోని బి.రామదుర్గం గ్రామంలో గ్రామ సర్పంచ్ నాగన్న, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె.రామాంజినేయులుల ఆధ్వర్యంలో బుధవారం ముగ్గుల పోటీలు నిర్వహించారు. పోటీలలో మొదటి బహుమతి ముక్కెళ్ల శ్రావణి, తరువాత స్థానాలలో మౌనిక, రాజ్యలక్ష్మి గెలుపొందారు. గెలుపొందిన మహిళలకు బహుమతులు అందించారు. అలాగే డోన్ పట్టణంలో మహిళా నాయకురాలు షమీం బేగం, లక్ష్మిదేవిల ఆధ్వర్యంలో పోటీలు నిర్వహించారు. పోటీలలో 30మంది మహిళలు పాల్గొన్నారు. మొదటి బహుమతి అశ్విని, రెండవ రామాంజనమ్మ, మూడవ బహుమతి మాధవి గెలుచుకున్నారు. విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పరమేశ్వరి, సీపీఐ నాయకులు సుంకయ్య, నారాయణ, మోటారాముడు, అబ్బాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్యాపిలి: మండల ప్రజలు మంగళ, బుధవారాల్లో సంక్రాంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం సంక్రాంతి సందర్భంగా ఇళ్ల ముంగిట రంగు రంగుల ముగ్గులు వేసి సంక్రాంతి లక్ష్మిని ఆహ్వానించారు. ఆలయాలకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. బుధవారం కనుమ వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పలు గ్రామాల్లో ఆటల పోటీలు నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేశారు.

బుగ్గానిపల్లెలో..

మండల పరిధిలోని బుగ్గానిపల్లె గ్రామంలో వెలసిన గ్రామస్తుల ఆరాధ్య దైవంగా వెలుగొందుతున్న చెన్నకేశస్వామి ఊరేగింపు గ్రామపురవీధులగుండా భక్తజన సందోహం మేళతాలాల మధ్య కనుల పండువగా జరిగింది. బుధవారం ఉదయం స్వామివారికి అభిషేకం, కుంకుమార్చన, మహామంగళ హారతి నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ సమీపంలో ఉన్న బావి వద్ద స్వామివారికి కలశస్థాపన చేసి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి మేళాతాలల మధ్య గ్రామ పురవీధులగుండా ఊరేగించగా.. భక్తులు భక్త పారవశ్యంలో మునిగి శరీరంపై కొరడాలతో కొట్టుకుంటూ జై చెన్నకేశవ, గోవింద గోవింద అంటూ ముందుకు సాగారు. ఉత్సవాల్లో నగర పంచాయతీ వైస్ చైర్మన్ నాగ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ మధు, భక్తులు కేశాలు నాయుడు, నాగరాజు, రవిశంకర్, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

సంజామల: మండలంలో ప్రజలు మూడు రోజుల పాటు సంక్రాంతి పండుగను ఘనంగా జరుపుకున్నారు. మంగళవారం సంక్రాంతి పండుగను పురస్కరించుకుని పేరుసోముల, వసంతాపురం గ్రామాలలో స్వామి వార్ల గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు.



పేరుసోముల గ్రామంలో గ్రామోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

బేతంచెర్ల : మండలపరిధిలో సంక్రాంతి పండుగను పురస్కరించుకొని మకర సంక్రాంతి, కనుమ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని చైన్న కేశవస్వామిని ఆలయ సభ్యులు గౌరి హుసేన్‌రెడ్డి, పుల్లారెడ్డి ఆధ్వర్యంలో స్వామి వారికి గ్రామోత్సవంతో పాటు పారువేట ఉత్సవం నిర్వహించారు. ఇందులో గెలుపొందిన వారికి ప్రోత్సాహక నగదు బహుమతులను అందజేశారు. గోరుమానుకొండ గ్రామంలో చెన్న కేశవ స్వామికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కోడె వెంకటేశ్వర్లు , గ్రామస్తుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ఊరేగింపు నిర్వహించారు. బుగ్గానిపల్లె తాండ, సీతారామాపురం, అంబాపురం, కనుమకింది కొట్టాల గ్రామంలో సంక్రాంతి సంభరాలు నిర్వహించారు.



బేతంచెర్ల పట్టణంలో ముగ్గుల పోటీలు